
సాక్షి ఒడిశా

గురువారం । 2 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,87,033
బంగారం	350 మిల్లీ గ్రాములు
వెండి	7 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



విదేశీ మద్యం దుకాణాలపై ఆకస్మిక దాడులు

పట్టణంలో విదేశీ మద్యం దుకాణాలపై అబ్కారీ శాఖ అధికారులు బుధవారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. - 10లో



జగన్నాథుని సన్నిధిలో గవర్నర్ రఘుబర్ దాస్

రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఒక రోజు తర్వాత రఘుబర్ దాస్ బుధవారం పుణ్య క్షేత్రం పూరీ సందర్శించి శ్రీజగన్నాథ ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. - 10లో

తాబేళ్ల సందడి







గంజాం జిల్లా రుషికుల్యా నది, బంగాళాఖాతం ముఖద్వారం వద్ద తాబేళ్లు సందడి చేస్తున్నాయి. ఏటా నవంబర్ మొదటి వారం నుంచి జనవరి చివరి వరకు తాబేళ్ల సంగమ సమయం కావడంతో ఈ ప్రాంతానికి అధిక సంఖ్యలో చేరుకుంటున్నాయి. ఇక్కడ ప్రతిఏటా దాదాపు 1000 తాబేళ్లు సంగమానికి ఉపక్రమిస్తాయని అంచనా. అనంతరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు తీరానికి చేరుకుంటాయి. ఈ ఏడాది వీటి సంఖ్య పెరిగే సూచనలు ఉన్నందున అటవీశాఖ అధికారులు రక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా చోట్ల ట్రాలర్లతో మత్స్యకారుల చేపల వేట నిషేధించినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ఆముల్యా కుమార్ ప్రధాన్ తెలియజేస్తున్నారు.

– బరంపురం

న్యూస్‌రీల్

ముగిసిన గౌరమ్మ ఉత్సవాలు



గౌరమ్మను నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక కంద్రవీధిలో గత పది రోజులుగా కొనసాగుతున్న గౌరమ్మ (నందన్న) ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లిన భక్తులు జంఝావతి నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపు సమయంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేసి ఆనందంగా గౌరమ్మను సాగనంపారు.

ఆక్రమణదారులకు నోటీసులు



ఆక్రమణదారుల ఇళ్లకు నోటీసులు అతికిస్తున్న అధికారులు

జయపురం: మున్సిపాలిటీ పరిధి హనాగుడలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇల్లు నిర్మించిన వారికి జయపురం మున్సిపల్ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో ఆక్రమణలు ఖాళీ చేయాలని మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ ఆదేశించారు. లేకుంటే మున్సిపాలిటీ చట్టం మేరకు అక్రమ కట్టడాలను తొలగించి, ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ స్థలంలో ఆధునిక కల్యాణ మండపంతో పాటు పశు జన్మ నియంత్రణ కేంద్రం(యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)ను ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. నోటీసులు అందుకునేందుకు కొంత మంది ఆక్రమణదారులు లేకపోవడంతో ఇళ్లకు నోటీసులు అతికించారు.

సత్తాచాటిన అక్కా తమ్ముళ్లు


- క్రాస్ బౌ షూటింగ్‌లో బంగారు పతకాలు



పతకాలతో అక్కా తమ్ముళ్లు

రాయగడ: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగిన పదో ప్రపంచ క్రాస్ బౌ షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రాయగడకు చెందిన అక్కా తమ్ముళ్లు ఎ.నేహ పట్నాయక్, లోహిత్ పట్నాయక్‌లు సత్తాచాటారు. అక్టోబర్ 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఇండియన్ క్రాస్ బౌ షూటింగ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఆగ్రాలోని పోలీసు లైన్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ పోటీల్లో ఇండియా, ఇస్టోనియా, యునైటెడ్ కింగ్ డమ్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, స్వీడన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు చెందిన 60 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో మన దేశం నుంచి పాల్గొన్న నేహ పట్నాయక్, లోహిత్ పట్నాయక్‌లకు బంగారు పతకాలు దక్కాయి. వీరిని పలువురు అభినందించారు.

భారీగా గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు, వాహనాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి పోలీసులు బుధవారం తెల్లవారుజామున మేటగూడ వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఒక వాహనం అతివేగంగా రావడంతో ఆపి తనిఖీలు చేయగా, కూరగాయల ట్రేలో గంజాయి లోడ్ చేసి ఉండడం గమనించారు. దీంతో గంజాయి స్వాధీనం చేసుకొని, వాహనంలో ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తులను, వాహనం వెనుక రెండు ద్విచక్ర వాహనాలతో వస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరు చిత్రకొండ సమితి పద్మగిరి గ్రామం నుంచి గంజాయిని రాజమండ్రికి తరలిస్తున్నట్లు తెలియజేశారు. పట్టుబడ్డ గంజాయి 6 క్వింటాళ్లు ఉంది. దీని విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని చిత్రకొండ ఐఐసీ ముకుంద మేల్క తెలిపారు. నిందితులను బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచారు.

ఇసుకాసురులు

- యథేచ్ఛగా ఇసుక అక్రమంగా దోచుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వాదాయానికి గండి



బగ్గలట్టి నదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



రూశికుల్యా నదిలో ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక నింపుతున్న దృశ్యం

బరంపురం: గంజాం జిల్లాలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ జరుగుతోంది. ప్రభుత్వ అదాయానికి గండి కొడుతూ కొంతకాలంగా అక్రమంగా నదుల్లో ఇసుక దోచుకుంటున్న మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. జిల్లాలోని అస్కా, కలసుండపూర్, పురుషోత్తంపూర్‌లో రూశికుల్యా నది, హింజిలికాట్, గడహడా నది, చికిటి, పత్రపూర్‌లో బగ్గలట్టి నదుల నుంచి ప్రతిరోజూ వందలాది లారీల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అయితే అధికారులకు ఈ విషయం తెలిసినా ముడుపులు అందుతుండడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ ఇసుక మాఫియా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది.

నదులకు గండ్లు

ఇసుక మాఫియా ముఠా బగ్గవా, బడా నదుల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతుండడంతో నదుల గట్లుకు గండ్లుపడి వరద ముప్పు ప్రమాదం ఉన్నట్లు ప్రజలు తీవ్ర అందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే తూతూ మంత్రంగా దాడులు జరిపి చేతులు దులుపుకుంటున్నట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు నో ఎంట్రీ పాస్‌కు విరుద్ధంగా ఇసుక లారీలు అతివేగంతో నగరంలోకి వస్తుండడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల గత స్థానిక గిరి రోడ్‌లో కాన్వెంట్ పాఠశాల విద్యార్థిని, సిటీ ఆస్పత్రి రోడ్‌లో ఖల్లికోట్ కళాశాల విద్యార్థినులు లారీలు ఢీకొన్న ఘటనల్లో మృత్యువాత పడ్డారు. ఇదేవిధంగా అంకుస్‌పూర్ రోడ్‌లో వరుసగా పదుల సంఖ్యలో ఇసుక లారీల దుర్ఘటనల్లో పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. అందువలన ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అంకుస్‌పూర్ రోడ్‌లో అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం



పత్రపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలు

వర్సిటీల్లో ఉచిత వై–ఫై



భువనేశ్వర్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు త్వరలో క్యాంపస్‌లో వై–ఫై సౌకర్యం ఉచితంగా లభించనుంది. ఉన్నత విద్యాసంస్థల్లో అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించాలనే ప్రభుత్వ నిబద్ధతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ క్యాంపస్‌ల్లో వై–ఫై ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లకు ఉన్నత విద్యా శాఖ లేఖ రాసింది. ఈ లేఖలో వై – ఫై సౌకర్యాల ఏర్పాటుకు సంబంధించి ఆమోదం కోసం ద్రవ్య సేవా పన్ను (జీఎస్టీ) మరియు వ్యవస్థ ఏర్పాటుకు ఏజెన్సీ యొక్క సేవా ఛార్జీలతో సహా వివరణాత్మక వ్యయ ప్రతిపాదన దాఖలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి రమాకాంత నాయక్ రిజిస్ట్రార్లకు ఆదేశించారు. చాలా వరకు అధ్యయన వనరులు, పుస్తకాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నందున విద్యార్థులకు వై – ఫై సౌకర్యాలపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2019 సంవత్సరపు ఎన్నికల వాగ్దానాల అమలు, వాస్తవ కార్యాచరణలో భాగంగా 2023–24 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉచిత వై–ఫై సేవలను అందించాలనే నిర్ణయం గురించి మే నెలలో అప్పటి ఉన్నత విద్యాశాఖ మంత్రి రోహిత్ పూజారి తెలియజేశారు. విద్యార్థులకు 1 జీబీ డేటా లభిస్తుందన్నారు. దీని కోసం ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అనుబంధం ఏర్పాటు చేస్తుందని మంత్రి వివరించారు.

రేపటి నుంచి కొరాపుట్ పర్వ్



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న కొరాపుట్ పర్వ్–2023 ఉత్సవాలు జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ భైరవ పీఠం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివాసీ సంస్కృతీ, సాంప్రదాయాల పరిరక్షణ, గుప్తంగా ఉన్న ఆదివాసీ కళలు, కళాకారులను ప్రోత్సహించే ప్రధాన లక్ష్యంతో కొరాపుట్ పర్వ్ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాల ప్రారంభాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు బొరిగుమ్మ సమితి సభా గృహంలో బొరిగుమ్మ సమితి చైర్మన్ దీప్తిమయి నాయిక్ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం సన్నాహక సమవేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈసారి గ్రామ పంచాయతీ స్థాయిల్లో కొరాపుట్ పర్వ్ నిర్వహించాలని, ప్రారంభోత్సవానికి అన్ని ప్రాంతాల నుంచి ఆదివాసీ కళాకార బృందాలను రప్పించాలని నిర్ణయించారు. సమావేశంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ, ఆదివాసీ అభివృద్ధి ప్రాజెక్టు విభాగ అధికారి రంజన్ బెహర, కోట్‌పాడ్ ఎమ్మెల్యే ప్రతినిధి నరేంద్ర బిశాయి, బ్లాక్ వైస్ చైర్మన్ రమాకాంత సామంతరాయ్, బొరిగుమ్మ బీడీవో విక్రమ కుమార్ దొర, అదనపు బీడీవో మాధురి ఆచారి, ఎ.సత్యనారాయణ సెట్టి, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు



బంజనగర్‌లో నాటుసారా బట్టీలపై దాడులు చేస్తున్న పోలీసులు



గుముసర అటవీ ప్రాంతంలో నాటుసార బట్టీలో సామగ్రి

బరంపురం: గంజాం పోలీసు జిల్లా పరిధి బంజనగర్ దగ్గర నువాతుట్టా అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై బంజనగర్ ఎక్సైజ్ అధికారులు మరియు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఊట బెల్లంను ధ్వంసం చేశారు. బరంపురం ఎక్సైజ్ కమిషనర్ ఉమేష్ చంద్ర మిశ్రా తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం బంజనగర్ పోలీసుస్టేషన్ పరిధి నువాతుట్ట సాహి గుముసరా అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్న బట్టీపై పోలీసులు దాడిచేసి 12 వేల లీటర్ల సారాను నష్టపరిచారు. అలాగే మరో 650 లీటర్ల సారా మరియు సామగ్రీలు స్వాధీనం చేసుకున్నారు.

చైతన్య ర్యాలీ

రాయగడ: అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా స్థానిక యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. న్యూకాలనీలోని బ్యాంక్ కార్యాలయం నుంచి పట్టణ వీధుల్లో ర్యాలీ కొనసాగింది. యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ తపన్ కుమార్ సాహు, విజిలెన్స్ అధికారి దేవరాజ్ పాణిగ్రాహి, మేనేజర్ కె.వి.కృష్ణప్రియ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ సిబ్బంది

'రహదారి నిర్మించాలని వినతి'



బీడీవోకు వినతిపత్రం అందించేందుకు వెళ్లిన గ్రామస్తులు

జయపురం: తమ గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టాలని జయపురం సమితి గొడొపాదర్ గ్రామ పంచాయతీ టింకసిల్ గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు బీడీవో శక్తి మహాపాత్రోను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. టింకసిల్ గ్రామంతో పాటు మరో మూడు గ్రామాల ప్రజలు మట్టి రోడ్డుపైనే ఆధారపడి రాకపోకలు జరుపుతున్నారని తెలియజేశారు. ఆయా గ్రామాల్లో దాదాపు 1500 పైగా ప్రజలు నివసిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి మట్టిరోడ్డులో అనేక గోతులు ఏర్పడడంతో కనీసం నడవడానికి సైతం ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. రోడ్డు దయనీయంగా ఉండడంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు గ్రామాల్లోకి రాక తీవ్ర ప్రమాద పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. గర్భిణులను, రోగులను డోలీలో మోసుకెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. అందువలన వెంటనే అధికారులు స్పందించి గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ధను హరిజన్, చంద్ర పరజ, అర్జున్ ముదిలి, రామనాథ్ శాంత, సబాయి నాయిక్, నవీణ నాయిక్, మోతి ముదులి, జంబావతి ముదులి, సోనియా పొరజ, బసంత హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్‌కు పతకాల పంట



ప్రశంసా పత్రాలతో పతకాలు సాధించిన క్రీడాకారిణులు

జయపురం: రూర్కెలాలోని బిజూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మహిళా కిక్ బాక్సింగ్ లీగ్ 2023–24 పోటీల్లో కొరాపుట్ క్రీడాకారులు పతకాల పంట పండించారు. 5 బంగారు పతకాలతో పాటు 7 రజిత పతకాలు, 2 బ్రాంజ్ పతకాలు వెరసి మొత్తం 14 పతకాలు గెలిచి విజయకేతనం ఎగురవేశారు. 80 కేజీల విభాగంలో మహ్మద్ ఫరిన్ రెండు బంగారు పతకాలను గెలుచుకోగా, 37 కేజీల విభాగంలో ప్రత్యూష బారిక్‌కు ఒక బంగారు పతకంతో పాటు ఒక రజిత పతకం వరించింది. 73 కేజీల విభాగంలో పుష్పాంజలి జెన ఒక బంగారు పతకం, 52 కేజీల విభాగంలో సుజాత ఖొర ఒక బంగారు పతకం, ఒక రజిత పతకం గెలుపొందారు. 60 కేజీల విభాగంలో కె.నమ్రత ఒక రజిత పతకం, 73 కేజీల విభాగంలో శతి సాహు, 70 కేజీల విభాగంలో టి.శ్రావణి, 37 కేజీల విభాగంలో సమీక్షా దొరలు ఒక్కొక్క రజిత పతకాలను గెలిచారు. 42 కిలోల విభాగంలో వంశిక ధల్, 54 కేజీల విభాగంలో అన్వేష్ ఖొరలు ఒక్కొక్క బ్రాంజ్ పతకాలను గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొన్న టీమ్‌కు మేనేజరుగా కొరాపుట్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి నిరంజన్ పాణిగ్రాహి, రిహాన్ ఖాన్‌లు వ్యవహరించారు. విజేతలను పలువురు ప్రశంసించారు.

క్లుప్తంగా

జీఎస్టీలో 4వ స్థానంలో రాష్ట్రం

భువనేశ్వర్: ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నెలాఖరు నాటికి నమోదైన ఆదాయంలో రాష్ట్రం నాలుగో స్థానంలో నిలిచింది. అక్టోబర్ నెలలో ఓజీఎస్టీ మరియు ఐజీఎస్టీ సమగ్ర ఆదాయం రూ.1,853.98 కోట్లుగా నమోదైంది. రాష్ట్ర నికర ద్రవ్య సేవా పన్ను (ఓజీఎస్టీ మరియు ఐజీఎస్టీ సెటిల్‌మెంట్) ఆదాయంలో నాల్గో అత్యధిక సేకరణను నమోదు చేసుకోవడం విశేషం. అక్టోబర్ 2023లో రూ.1,853.98 కోట్లు. అక్టోబర్ 2023 వరకు నెలవారీ సగటు పన్ను వసూళ్లు (ఓజీఎస్టీ మరియు ఐజీఎస్టీ సెటిల్‌మెంట్) రూ.1,744.30 కోట్లు కాగా అక్టోబర్ 2022 సగటు పన్ను వసూలు రూ.1,475.61 కోట్లకు పరిమితమైంది. దీంతో 18.21 వృద్ధి రేటు సాధ్యమైంది. ఈ ఏడాది అక్టోబర్‌లో ఓజీఎస్టీ సేకరణ రూ.1,306.47 కోట్లు నమోదు కాగా, అక్టోబర్ 2022లో ఆదాయం రూ.1,058.38 కోట్లపై 23.43 శాతం వృద్ధి రేటుతో ఆధిక్యత సాధించింది. ఒడిశాలోని సీటీ మరియు జీఎస్టీ కమిషనరేట్ పర్యవేక్షించే ఓజీఎస్టీ, ఐజీఎస్టీ, వ్యాట్, ప్రవేశ పన్ను, వృత్తి పన్ను వంటి అన్నిచట్టాల కింద ఈ ఏడాది అక్టోబర్ ఆదాయం రూ.2,831.17 కోట్లుగా నిర్ధారించారు.

గజలక్ష్మీ దేవి నిమజ్జనం



నిమజ్జనానికి వెళ్తున్న అమ్మవారి విగ్రహం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని తోలాసాయి వీధిలో కొలువుదీరిన గజలక్ష్మీ దేవి అమ్మవారి విగ్రహాన్ని బుధవారం నిమజ్జనం చేశారు. ఐదు రోజులు పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించి, నిమజ్జనం చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవుదళ హెచ్‌ఎంకు మెమో

రేగిడి: మండలంలోని దేవుదళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధనాతీరుపై బొబ్బిలి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ బ్రహ్మాజీ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి పదోతరగతి విద్యార్థుల అభ్యసనపై ఆరాతీశారు. విద్యార్థుల్లో అవగాహన లేకపోవడంపై ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ఎటువంటి సమాచారం లేకుండా పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాజ్యలక్ష్మి సెలవుపెట్టడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఒకే రోజు పాఠశాలకు ఎక్కువ మంది గైర్హాజరు కావడంపట్ల అసహనం వ్యక్తంచేసి, హెచ్‌ఎంకు మెమో జారీచేశారు. అంతకుముందు బూరాడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను, లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీచేసిన ఆయన జగనన్న గోరుముద్ద అమలు, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, నాడు-నేడు పనులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.వి ప్రసాదరావు, బి.ఎరకయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అంతర్ వర్సిటీ పోటీలకు షేక్ సూరున్నా ఎంపిక

విజయనగరం అర్బన్: రాజస్థాన్‌లోని జుంజుస్‌లో ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి అంతర్ యూనివర్సిటీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 2023-24లో రాష్ట్రం తరపున పాల్గొనేందుకు స్థానిక సత్య డిగ్రీ విద్యార్థిని షేక్ సూరున్నా అర్హత సాధించింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయి దేవమణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఆంధ్రయూనివర్సిటీలో జరిగిన అంతర్ కళాశాలల స్థాయి పోటీల్లో తైక్వాండో 53 కేజీల విభాగంలో ఆమె ప్రథమ స్థానం కైవసం చేసుకుందని తెలిపారు. అంతర్‌వర్సిటీ పోటీలకు ఎంపికైన షేక్‌సూరున్నాను కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ బి.సూరపునాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఉదయ్‌కిరణ్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

పూరిల్లు దగ్ధం

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామానికి చెందిన రామస్వామి పూరిల్లు దగ్ధమైనట్లు సర్పంచ్ నేతేటి దీపిక బుధవారం తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరగడంతో ఇల్లు దగ్ధమై రూ.40 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు చెప్పారు. ప్రమాద విషయంపై తహసీల్దార్, వీఆర్వోలకు సమాచారం అందించామన్నారు.

ఎన్ఎంయూ నిరసన

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఎం.డి ఇచ్చిన సూచనలను ఎ.డి పాటించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక డిపో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1/2019 నెలలో ఇచ్చిన సర్క్యులర్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చెక్కులపై జీతాలు ఇవ్వాలని, వెహికల్ కండిషన్ మెరుగుపరచాలని సర్వీసులు తక్కువగా ఉన్న కారణంగా బస్సులను వేరే డిపోకు పంపి ఉద్యోగులను బదిలీ చేయడం ఆపాలని కోరారు. సస్పెన్షన్ పేరిట వేరే డిపోకు బదిలీ చేయరాదని ప్రభుత్వ ట్రాన్స్‌ఫర్ నిబంధనలు అమలు పరచాలన్నారు. కండక్టర్, డ్రైవర్లపై వేధింపులు ఆపాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పీటీరాఫిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బీఎస్‌రాములు, కె.సత్యం, చంద్రమౌళి, బి.రామారావు, ఎం.సుజాత, నీరజ, రాజయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ మద్యం దుకాణాలపై
ఆకస్మిక దాడులు



విదేశీ మద్యం దుకాణంలో దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రాయగడ: పట్టణంలో విదేశీ మద్యం దుకాణాలపై అబ్కారీ శాఖ అధికారులు బుధవారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎమ్మార్పీ ధర్లపై అధికంగా విదేశీ మద్యం దుకాణాల్లో విక్రయాలు కొనసాగిస్తున్నారనే వచ్చిన ఆరోపణలపై అధికారులు ఈ మేరకు దాడులు నిర్వహించారు. జిల్లా అబ్కారీ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ గుప్తేశ్వర్ ప్రధాన్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ సీమాకిరణ్ బెక్, మొబైల్ ఇన్‌స్పెక్టర్ హితాంశు శేఖర్ మల్లిక్ తదితర సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. స్థానిక ఉమాశంకర్ కూడలిలోని విదేశీ మద్యం దుకాణం నంబర్ 3, 11 కౌంటర్లలో దాడులు చేపట్టారు. షాపులోని స్టాక్ వివరాలు పరిశీలించారు. అదే విధంగా నకిలీ మద్యం బాటిళ్లు ఉన్నాయనే అనుమానంతో తనిఖీలు చేపట్టారు. కొనుగోలుదారులకు ఎమ్మార్పీ కంటే అధికంగా వినియోగిస్తున్నారు అనే విషయంపై ప్రశ్నించారు. కొంతమంది రూ.10లు అధికంగా తీసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఇకపై అధిక ధరలకు అమ్ముతున్నారనే ఫిర్యాదులు వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అయితే తాము ఎప్పటిలాగే దాడులను నిర్వహిస్తున్నామని, అధిక ధరలకు అమ్ముతున్నారన్న ఫిర్యాదుల అందలేదని డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రధాన్ తెలియజేశారు. అనంతరం మరి కొన్ని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.



స్టాక్ పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలం వద్ద కారు

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి జములబడి కూడలిలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి భగిరథీ కొంటొబొంసా (45), గాయాలైన వారు గాయత్రి కొంటొబొంసా (25), అంజన కొంటొబొసా (29)లుగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే వీరంతా జములబడి ప్రాంతంలోని ఒక ఇటుక బట్టీలో కూలి పనులు చేసుకునేందుకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి తమ ఇళ్లకు చేరుకునేందుకు గొడొలెలిబడి గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నారు. మొత్తం ఎనిమిది మంది నడుచుకుంటూ వస్తుండగా ముకుందపూర్ నుంచి వస్తున్న ఒక కారు అదుపుతప్పి నడుచుకుంటూ వెళ్తున్నవారిని వెనుక నుంచి ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన భగిరథీ కొంటొబొంసా, గాయత్రి, అంజన కొంటొబొంసాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భగిరథీ కొంటొబొంసా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగతా ఇద్దరికి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు తోటి శ్రామికులు చందిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే కారు డ్రైవర్ కారును విడిచి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక పరిపక్వత

రాజాం: స్వయం ఉపాధి కార్యక్రమాలు, వ్యాపారాలతో యువతీ యువకులు ఆర్థికంగా పరిపక్వత చెందడమే కాకుండా, ఆర్థిక స్థిరత్వాన్ని ఏర్పాటుచేసుకునేందుకు అవకాశం ఉందని నాబార్డ్ డిస్ట్రిక్ట్ డివిజనల్ మేనేజర్ నాగార్జున అన్నారు. ఈ మేరకు బుధవారం రాజాం పట్టణంలోని జీఎంఆర్ కేర్ ఆస్పత్రి పక్కన జీఎంఆర్ నగర్‌లో నాబార్డ్ సహకారంతో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఏర్పాటుచేసిన అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ ట్రెనింగ్ పోగ్రాంను ఆయన ప్రారంభించారు. ఉచిత స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా 60 రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్వయం ఉపాధి పొందేందుకు ప్రతి ఒక్క నిరుద్యోగి ముందుకురావాలని పిలుపునిచ్చారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. శిక్షణ కాలంలో యువతకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎంఆర్‌వీఎఫ్ జీఎం కె.జయకుమార్, సైరేడ్ డైరెక్టర్ రమేష్, ఏపీఎం నాగరాజు, జీఎంఆర్‌వీఎఫ్ సిబ్బంది కె.నాగేశ్వరరావు, ఆర్.అప్పలనాయుడు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

'సంస్కృతి' పోటీల్లో రాజాం విద్యార్థి ప్రతిభ

రాజాం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన సంస్కృతి సంస్థ గత నెల 10న నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీల్లో రాజాంకు చెందిన ఆర్.దేవిక విద్యార్థి ప్రతిభ చూపి పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు ఈనెల 2న హైదరాబాద్‌లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు సంస్కృతి సంస్థ ఒక ప్రకటన జారీ చేసింది. దేవిక రాజాంలోని శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. విజయనగరం జిల్లా స్థాయిలో దేవికకు ప్రథమ బహుమతి లభించిందని పాఠశాల కరస్పాండెంట్ గట్టి పాపారావు బుధవారం తెలిపారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



వాల్‌పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ (ఎస్బీసీసీ) జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు జేసీ మయూర్ అశోక్ సూచనలతో విజయనగరం మండలంలోని మలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో యుక్తవయసులోనే 58 శాతం మంది గర్భిణులు ప్రసవ సమయంలో మరణిస్తున్నారన్నారు. ఇలాంటి మరణాలకు అడ్డుకట్ట వేయాలంటే బాల్య వివాహాలను నిర్మూలించడమే మార్గమని పేర్కొన్నారు. 2006 బాల్య వివాహ నిషేధ చట్టంపై విద్యార్థులకు వివరించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. హిమోగ్లోబిన్ 12 శాతం కంటే తక్కువ ఉంటే రక్తహీనతగా గుర్తెరగాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్యం చదువుకోసమే అనే వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించారు.

జేఏఎస్ శిబిరాల్లో
వైద్యం + ఆహారం

- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట
- ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- అధికారుల అభ్యర్థన మేరకు జేఏఎస్ కార్యక్రమానికి మధ్యాహ్న భోజనం మంజూరు
- జిల్లాలో ఇప్పటివరకు 1,29,091 మందికి వైద్యం
- ల్యాబ్‌టెస్ట్‌లు: 65,819
- మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసిన కేసులు: 1971



పార్వతీపురం మండలం ములగ గ్రామంలో వైద్యశిబిరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి. జగన్నాథరావు

పార్వతీపురంటౌన్:

ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. మన్యంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చేవారికి వైద్యంతో పాటు మధ్యాహ్న భోజనం వడ్డిస్తోంది. గిరిజన ప్రాంతం కావడం.. కొండలపై నుంచి శిబిరాలకు చేరుకునేందుకు అధికసమయం పడుతుండడంతో జిల్లా ఉన్నతాధికారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం భోజన సదుపాయం కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేసింది. ఉత్తరాంధ్రలో పార్వతీపురం మన్యంజిల్లాతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నిర్వహించే జేఏఎస్ శిబిరాల్లో భోజన ఏర్పాట్లు చేస్తోంది.

రికార్డుస్థాయిలో వైద్యసేవలు

సెప్టెంబర్ 30వ తేదీ నుంచి ఈ నెల 14 వరకు జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ జారీ చేశారు. ఆ మేరకు ప్రతిరోజు శిబిరాలు నిర్వహిస్తున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటివరకు 1,29,091 మందికి వైద్యసేవలు అందజేశారు. ఇందులో స్పెషలిస్టు ఓపీలు 50,346 ఉండగా, మెరుగైన వైద్యం కోసం 1971 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

పక్కా ప్రణాళికతో...

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పక్కా ప్రణాళికతో జిల్లా అధికార యంత్రాంగం నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల వారీగా సెప్టెంబర్ 16వ తేదీ నుంచి ఇంటింటి సర్వే నిర్వహించింది. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, టీబీ, మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణకు రక్త పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించింది. కేస్ షీట్స్ సిద్ధం చేసింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేసింది. వీరికి ఓపీలను అందజేసి జేఏఎస్ శిబిరాల్లో ఉచిత వైద్యంతో పాటు మందులను అందజేస్తోంది. అవసరమైన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకింద శస్త్రచికిత్సలు చేయిస్తోంది. రోగులు కోలుకునే వరకు పర్యవేక్షించే బాధ్యతలను ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది చూస్తున్నారు.

జిల్లాలో జేఏఎస్ వైద్యసేవలు ఇలా...	
మండలాలు	15
నిర్వహించిన వైద్యశిబిరాలు	276
వైద్యసేవలు పొందినవారి సంఖ్య	1,29,091
స్పెషలిస్టు వైద్యసేవలు	50,346
సాధారణ ఓపీలు	74,967
సుగర్ టెస్టులు	13,102
హైపర్‌టెన్షన్ (బీపీ) పరీక్షలు	21,122
వైద్యసేవలు పొందిన గర్భిణులు	2,746
బాలింతలు	1,537
ఎనిమియా	2,403
ల్యాబ్ టెస్టులు	65,819
ఈసీజీ పరీక్షలు	2,851
ఉన్నత వైద్యానికి రిఫర్ చేసిన కేసులు	1971



వైద్యశిబిరాల వద్ద రోగులకు ఆహారం అందజేస్తున్న సిబ్బంది

మంచి ఆలోచన



జగనన్న ఆరోగ్య సురక్ష కింద పేద, సామాన్య ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించడం నిజంగా మంచి ఆలోచన. 15 మండలాల్లో మొత్తం 292 వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉండగా, 276 శిబిరాలు నిర్వహించాం. 1,29,091 మందికి వైద్య సేవలందించాం. మెరుగైన వైద్యం కోసం 1,971 మందిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాలకు వైద్యసేవలకు వచ్చేవారికి భోజన సదుపాయం కల్పిస్తున్నాం.

– డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం మన్యం

జగన్నాథుని సన్నిధిలో గవర్నర్ రఘుబర్ దాస్



శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఒక రోజు తర్వాత రఘుబర్ దాస్ బుధవారం పుణ్యక్షేత్రం పూరీ సందర్శించి శ్రీజగన్నాథ ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింహద్వారం ప్రాంగణంలో గవర్నర్‌ను ఉన్నతాధికారులు స్వాగతించి ఆలయంలోకి తీసుకెళ్లారు. ఆలయ సేవకులు దాస్‌కు ఆలయ సంప్రదాయ రీతిలో పట్టు ఉత్తరీయంతో ఆహ్వానించి మూల విరాటుల దర్శనం కోసం గర్భ ఆలయం ప్రాంగణానికి తీసుకెళ్లారు. భొత్తొరొ కఠా ఆవరణలో పూజాదుల్లో గవర్నర్ పాల్గొన్నారు. రత్న వేదికపై మూల విరాటులను దర్శించుకున్న గవర్నర్ రఘుబర దాస్ దేవస్థానం సముదాయంలో కొలువుదీరిన శ్రీమహాలక్ష్మి మరియు దేవి విమల ఆలయాల్లో ప్రత్యేక పూజాదులు చేశారు. ఆలయ సముదాయంలో గవర్నర్ దాదాపు 30 నిమిషాల పాటు గడిపారని పూరీ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఏడీఎం) పి.కె.సాహు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ముందు సోమవారం గవర్నర్ రఘుబర దాస్ శ్రీజగన్నాథ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రార్థనలు చేసిన విషయం తెలిసిందే.

రంగంలోకి దిగిన ఈవోడబ్ల్యూ

భువనేశ్వర్: చలామణి నిలిపి వేయబడిన రూ. 2,000 నోట్ల మార్పిడి కోసం స్థానిక భారత రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) ఆవరణలో పెద్ద సంఖ్యలో ప్రజలు బారులు తీరుతున్నారు. వీరిలో అత్యధికులు బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఉంటున్నారు. ఈ పరిస్థితిపై సర్వత్రా పలు సందేహాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక నేరాల శాఖ పరిశీలన కోసం ప్రజలు బారులుతీరిన భారత రిజర్వ్ బ్యాంకు ప్రాంగణానికి బుధవారం చేరారు. ఈ వర్గం ప్రజలను ఆరా తీశారు. అయితే వివరాలను వెల్లడించేందుకు నిరాకరించారు. విచారణ, దర్యాప్తు పూర్తయితే వివరాలు వెల్లడించడం జరుగుతుందని ఈవోడబ్ల్యూ అధికారి ఒకరు తెలిపారు. ప్రధానంగా రూ.2,000 నోట్ల మార్పిడి కోసం బారులు తీరిన ప్రజల వెనక అదృశ్య వర్గం ఉన్నట్లు వచ్చిన ఆరోపణలపై ఈ శాఖ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక నేరాల శాఖ (ఈవోడబ్ల్యూ) 2 మంది సభ్యుల బృందం బుధవారం స్థానిక భారత రిజర్వ్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో బారులు తీరిన వారిని ప్రశ్నించింది.

గ్రామాల్లో కలెక్టర్ పర్యటన



వంశధార పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి బొత్తవ, కిడిగాం ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో పంట పొలాలు బీటలువారాయి. దీనిపై గత నాలుగు రోజులుగా జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు బొత్తవ, ఖండవ, కె.సీతాపురం పంచాయతీల్లోని సింగిపురం, దేవుదళ, బిసిరింగి గ్రామాల్లో పర్యటించి రైతుల కష్టాలు తెలుసుకున్నారు. దీంతో ఆయన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ కాశీనగర్ ప్రాంతం బొత్తవ గ్రామంలో బుధవారం పర్యటించి అక్కడి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బొత్తవ గ్రామంలో సాగునీటి సంఘాల పంపుసెట్లు పాడవ్వడంతో వాటి మరమ్మతులకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టర్‌తో పాటు ఇతర వ్యవసాయ అధికారులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తదితరులు

4న ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు మూడు ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో 205 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4న ఉదయం 10గంటల నుంచి బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేళాకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. మేళాలో నవత ట్రాన్స్‌పోర్ట్, పేటీఎం, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 'ఎన్‌సీఎస్.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్ లాగిన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో నీతిఆయోగ్ ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు కింద ఇన్నోవేషన్ హబ్, అనుభవ పూర్వక అభ్యాస కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. నీతిఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బీవీఆర్ సుబ్రహ్మణ్యం బుధవారం ఆశావహ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆశావహ జిల్లాల కింద పార్వతీపురం మన్యం జిల్లాకు నీతి ఆయోగ్ ప్రోత్సాహకంగా రూ. 3కోట్లు మంజూరు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని కోరింది. ఈ మేరకు అభ్యాస కేంద్రమైన ఇన్నోవేషన్ హబ్‌ను స్థాపించడానికి పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగం ప్రాజెక్టును సిద్ధం చేసిందని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడంతో పార్వతీపురం జిల్లాను మరోసారి ప్రశంసించడం పట్ల నీతి ఆయోగ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనుభవ పూర్వకంగా విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించడం, పరిశీలన, డేటా రికార్డుచేయడం, నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను పెంపొందించడం, నాణ్యమైన విద్యను సాధించడం, విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఉన్నత చదువులు చదవాలనే సంకల్పంతో జిల్లాలో ప్రతిపాదించామన్నారు.

లక్షల మందికి ప్రయోజనం

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు, గిరిశిఖర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల నుంచి ఆర్థిక స్తోమత లేని గిరిజన సమూహాల నుంచి 9 నుంచి 12వ తరగతి వరకు గల సుమారు 2లక్షల 21వేల 917మంది విద్యార్థులు ఈ ప్రాజెక్టు నుంచి ప్రయోజనం పొందబోతున్నారని కలెక్టర్ అన్నారు. జేఎన్‌టీయూ, ఆంధ్రా యూనివర్సిటీ తదితర ప్రాంతాల నుంచి మాస్టర్ ట్రైనర్లను గుర్తించామని, పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ ప్రాజెక్టును 15 రోజుల్లో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం యోచిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఆర్డీఓ కె.హేమలత, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారిణి డి.మంజుల వీణ, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

5, 6 తేదీల్లో పౌరాణిక ప్రదర్శనలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో వైజయంతి ఉత్సవ వేదికపై ఈ నెల 5, 6 తేదీల్లో పలు పౌరాణిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ బుధవారం తెలిపారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు మాయాబజార్, సోమవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీనివాస కల్యాణం పౌరాణిక ప్రదర్శనలు జరుగుతాయని, శ్రీవినాయక నాట్యమండలి, సురభి థియేటర్స్, తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆదుకున్న 108 అంబులెన్స్



సపర్యలు చేస్తున్న సిబ్బంది

మందస : మారుమూల ప్రాంతాల్లో 108 వాహనాల సేవలు అద్భుత సేవలు అందిస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్నాయి. మందస మండలం చీపి పంచాయతీ బొందికరి అనే మారుమూల గిరిజన గ్రామానికి చెందిన సవర రిస్వధినికి బుధవారం పురిటినొప్పులు మొదలయ్యాయి. అందుబాటులో వైద్యం లేకపోవడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. కొద్ది సమయంలోనే వాహనం చేరుకుని, గర్భిణిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా.. మందస సమీపంలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ బి.తారకేశ్వరరావు, పైలట్ కె.శ్రీనివాస్‌లు ప్రాథమిక చికిత్స అందజేశారు. ఆడ శిశువు మెడకు బొడ్డుతాడు చుట్టుకోవడంతో వేరు చేసి తల్లీ, బిడ్డకు ఊపిరి పోశారు. అనంతరం హరిపురం సీహెచ్‌సీలో చేర్పించారు. క్షేమంగా కాపాడిన సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ భేష్..!



వైద్య సిబ్బందితో అమెరికా బృందం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజారోగ్యమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, సీకేడీ(క్రోనిక్ కిడ్నీ డిసీజ్) ప్రోగ్రాం సత్ఫలితాలు ఇస్తుండటంతో కింగ్‌జార్జ్ ఇన్‌స్టిట్యూట్ (అమెరికా) బృంద పరిశీలకులు డాక్టర్ కేసీ జాన్ ముఖ్యమంత్రి జగన్ పాలన భేష్ అంటూ అభినందించారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లిలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్, సీకేడీ ప్రోగ్రాంను పరిశీలించారు. వైద్యులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య పరీక్షలు, మందులు, కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీకేడీ ప్రోగాం మేనేజర్ డాక్టర్ గుమ్మడి బాలాజీ, సూపర్‌వైజర్ సత్యనారాయణ, సీకేడీ రీసెర్చ్ కౌన్సిలర్ దిలీప్, వైద్యాధికారి కనిష్క, చక్రధర్, తమ్మినాన దుర్యోధన, సిబ్బంది పాల్గొన్నారు.

జైలు ముద్దాయిల కేసులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైలు ముద్దాయిల కేసుల సత్వర పరిష్కారానికి పోలీసు, ఎక్సైజ్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో అండర్ ట్రయల్ ప్రిజనర్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు త్వరితగతిన చార్జిషీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, ఫణికుమార్, జిల్లా న్యాయ సేధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, మెజిస్ట్రేట్‌లు శారదాంబ, శ్రీవిద్య, భరణి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ఏఎస్పీ తిప్పేస్వామి, జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ మెట్ట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆటో ఢీకొని మహిళకు గాయాలు

కొత్తూరు: మండలంలోని బలద గ్రామానికి చెందిన కంచరాం రత్నాలు రోడ్డు దాటుతుండగా హడ్డుబంగి నుంచి కాశీనగర్ వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఒడిశా రాష్ట్రం కిడిగాంకు చెందిన ఆటో డ్రైవర్ కడగల తవిటినాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ అజాద్ అహమ్మద్ తెలిపారు

తిత్లీ తుఫాన్ సమయంలో జరిగిన మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. టీడీపీ హయాంలో తుఫాన్ అనంతరం చేపట్టిన సహాయక చర్యల ముసుగులో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగింది. పశు శిబిరాల నిర్వహణ, దాణా, పశుగ్రాసం, మందులు, వ్యాక్సిన్స్ పేరుతో ప్రభుత్వ నిధులను భారీగా కొల్లగొట్టారు. ఆడిట్ అధికారుల పరిశీలనలో నాటి అవినీతి బాగోతమంతా బయటపడింది. దీంట్లో నాడు మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడుతో కుమ్మక్కైన అప్పటి పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు పాత్ర ఉందని తాజాగా లోకాయుక్తకు ఫిర్యాదు వెళ్లింది. ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో నాటి అవినీతి డొంక కదిలింది. దీనిపై నివేదిక ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌ను లోకాయుక్త ఆదేశించగా.. చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులను డైరెక్టర్ ఆదేశించారు. దీంతో పశు సంవర్ధక శాఖలో గుబులు రేగింది. ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోలేక ప్రస్తుతం ఉన్న అధికారులు ఒక్కొక్కరిగా సెలవుపై వెళ్లిపోతున్నారు.



పశువుల ముసుగులో మేసేశారు!



- తిత్లీ తుఫాన్ నష్ట పరిహారం కొట్టేసిన పచ్చనేతలు
- అధికారుల రీ సర్వేలో బట్టబయలైన బినామీల బాగోతం
- వెలుగులోకి టీడీపీ హయాంలో జరిగిన పశు కుంభకోణం
- లోకాయుక్తకు వెళ్లిన ఫిర్యాదుతో బయటపడ్డ అవినీతి
- నాటి మంత్రి అచ్చెన్నాయుడు అండతో చెలరేగిన అప్పటి జేడీ వెంకటేశ్వర్లు
- రికవరీకి ఆడిట్ అధికారుల సిఫారసు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: 2018 అక్టోబర్ 11న ఉద్దానంలో తిత్లీ తుఫాన్ విధ్వంసం సృష్టించింది. రైతు కుటుంబాలైతే చిన్నాభిన్నమయ్యాయి. రైతులకు అందించాల్సిన నష్ట పరిహారాన్ని నాటి టీడీపీ నేతలు బాధితుల ముసుగులో గెద్దలా తన్నుకుపోయారు. నాటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం ప్రకారంగా కాకుండా టెక్కలిలోని ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి, ఉద్యానవన శాఖ అధికారులను దగ్గర పెట్టుకుని తమకు నచ్చిన, కావల్సిన రైతులు, బినామీల పేర్లను ఎక్కించి వారికే పరిహారం వచ్చేలా చేశారు. భూముల్లేని టీడీపీ సానుభూతి పరులకు భూములున్నట్టుగా చూపించి, తక్కువ భూమి ఉన్న టీడీపీ శ్రేణులకు ఎక్కువ భూమి ఉన్నట్టుగా నమోదు చేసి, పల్లం భూమిని మెట్ట భూమిగా నమోదు చేసి, పంచాయతీకి చెందని వ్యక్తులను స్థానికంగా చూపించి అడ్డగోలుగా పరిహారాన్ని కొట్టేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బాధితులు వరుసగా ఫిర్యాదులు చేస్తుండటంతో విచారణకు ఆదేశించారు. 2018లో తయారు చేసిన జాబితాలో లక్షా 6వేల 800మంది నష్టపోయినట్టు పేర్కొనగా, దానిని విచారణ చేపట్టేసరికి 90,789 మంది మాత్రమే అర్హులున్నట్టు తేల్చారు. మిగతా 16 వేల మంది వరకు అనర్హులే ఉన్నారు. దీంతో వైఎస్ జగన్ ప్రభుత్వం పెంచిన పరిహారం రూ.182.60 కోట్లు కూడా విచారణ అనంతరం వడబోసిన జాబితాలో వారికే ఇచ్చారు.

రిటైర్డ్ టీచర్ ఫిర్యాదుతో..

రైతుల పేరిట జరిగిన దోపిడీ మరవకముందే నాడు పశువుల పేరుతో జరిగిన అవినీతి.. ఓ రిటైర్డ్ టీచర్ చేసిన ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పశు శిబిరాల నిర్వహణ, దాణా, పశుగ్రాసం, మందులు, వ్యాక్సిన్స్ పశు యజమానులకు అందించినట్టుగా చూపించి కోట్లాది రూపాయలు స్వాహా చేశారని రిటైర్డు ఉపాధ్యాయుడు కంచరాన ప్రసాదరావు నేరుగా కర్నూలులో ఉన్న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో కీలక సూత్రధారి నాటి పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, కింజరాపు అచ్చెన్నాయుడు అండదండలున్న ఎం.వెంకటేశ్వర్లు అని ఫిర్యాదులో స్పష్టం చేశారు. అందుకు తగ్గ ఆధారాలు సమర్పించారు. ముఖ్యంగా 2018 అక్టోబర్‌లో జరిగిన లావాదేవీలపై ఆడిట్ అధికారులు గుర్తించిన లోపాల నివేదికను అందజేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న లోకాయుక్త ఆడిట్ రిపోర్టుతో పాటు కంచరాన ప్రసాదరావు చేసిన ఫిర్యాదును నేరుగా పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌కు పంపించి నవంబర్ 17లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

అప్పటి జేడీపై ప్రేమ..


వాస్తవంగా టీడీపీ హయాంలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లుపై అప్పటికే ఏసీబీ కేసు ఉంది. 2002లో ఎచ్చెర్లలో డాక్టర్‌గా పనిచేసినప్పుడు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. దీంతో సస్పెండయ్యారు. 2014లో ప్రూవ్ కావడంతో జైలు శిక్షతో రూ.30వేల జరిమానా విధించడమే కాకుండా డిస్మిస్ చేయాలని కోర్టు ఆదేశాలిచ్చింది. దానిపై హైకోర్టుకు అప్పీలుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఆ సమయంలో టీడీపీ ప్రభుత్వం ఉండటంతో వెంకటేశ్వర్లను సొంత జిల్లాలోనే ఇన్‌చార్జి జేడీగా నియమించారు. వారితో దందా చేయించారు. ఇదంతా నాటి అచ్చెన్న కనుసన్నల్లోనే జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి.

సెలవుపై ప్రస్తుత అధికారులు

లోకాయుక్తకు ఫిర్యాదు మేరకు అప్పటి జేడీగా పనిచేసిన వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకుని, ఆడిట్ అధికారులు తేల్చినట్లు నిధులు రికవరీ చేసి, నివేదిక ఇవ్వాలని ప్రస్తుత అధికారులను డైరెక్టర్ ఆదేశించారు. దీంతో ఏం చేయాలో పాలుపోక ఇప్పటికే ఒక జాయింట్ డైరెక్టర్ సెలవుపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో వచ్చిన డిప్యూటీ డైరెక్టర్ కూడా నాకెందుకీ తలనొప్పి అని సెలవు పెట్టేశారు.

- ప్రకృతి వైపరీత్యాల సమయంలో కలెక్టర్ అనుమతి తీసుకుని 2245 హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి రూల్ 27 ప్రకారం అడ్వాన్సు బిల్లు పెట్టి నిధులు డ్రా చేయాలి. కానీ, ఇక్కడలా చేయలేదు. కలెక్టర్ అనుమతి తీసుకోకుండా అచ్చెన్నాయుడు, ఓఎస్‌డీ పోలినాయుడు మౌఖిక ఆదేశాలతో ఇష్టారీతిన నిధులు వినియోగించారు.
- రూ.5.63కోట్లుకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ కోసం కలెక్టర్‌కు నోట్ ఫైల్ పెట్టాలి. అలా చేయలేదు. నేరుగా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు పెట్టారు. దీనిపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కలెక్టర్ అనుమతి ఇవ్వాలి, నాకు ఇచ్చే అధికారం లేదు అని అప్పటి డైరెక్టర్ చెప్పేశారు. అయినప్పటికీ ఉత్తర ప్రత్యుత్తరాలు జరగకుండా 'పని' కానిచ్చేశారు.
- హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి పశు సంవర్ధక శాఖ జేడీ ఖాతాకు అడ్డగోలుగా రూ.6కోట్ల 21లక్షల 25వేల 250 సొమ్ము మళ్లించారు. అందులో 5,63,29,029 ఖర్చు చేసినట్టు చూపించారు. ప్రత్యేకంగా క్యాష్ బుక్ నిర్వహణ చేయలేదు.
- రూ.5.63 కోట్లుకు సంబంధించి స్టాక్ అండ్ ఇష్యూ రిజిస్టర్లు నిర్వహించలేదు.
- మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీతో బాధితుల పశువులను గుర్తించాలి. ఆ నష్టాన్ని పంచాయతీల్లో ప్రదర్శించాలి. ఇదంతా అప్పుడు జరగలేదు. బాధితులకు దాణా సరఫరా చేసినట్టు చూపించేశారు.
- పశు వైద్యశాల పరిధిలో జరిగిన నష్టంతో పాటు ఎంత దాణా సరఫరా చేయాలో క్షేత్రస్థాయి నుంచి ఇండెంట్ తీసుకోవాలి. అదేమి చేయకుండా జిల్లా కార్యాలయ స్థాయిలోనే క్షేత్రస్థాయి నుంచి వచ్చినట్టుగా ఇండెంట్లు సృష్టించేసి దాణా స్కామ్ చేశారు.
- పశు వైద్యశాల నుంచి ఎన్ని పశువులు ఇబ్బంది పడ్డాయి, ఎంతమంది రైతులకు, ఎన్ని పశువులకు ఎంత మందులు కావాలన్న ఇండెంట్‌ను క్షేత్రస్థాయి నుంచి తీసుకోవాలి. అలాకాకుండా నేరుగా జేడీ ఆఫీస్ నుంచే ఇండెంట్ పేరుతో రిక్వైర్‌మెంట్ పెట్టేసి నిధులు కొల్లగొట్టేశారు.
- దాణా కొనుగోలు చేయాలంటే ముందు క్వాలిటీ ల్యాబ్ రిపోర్టులు తీసుకుని పరిశీలించాక ముందుకెళ్లాలి, కానీ, ల్యాబ్ రిపోర్టులే తీసుకోకుండా గూడుపుఠాణి నడిపించారు.
- దాణా సరఫరాలోనూ నకిలీ బాగోతం నడిపారు. సాధారణంగా పశువుల యజమానులకు గాని, క్షేత్రస్థాయి పశు సంవర్ధక శాఖ సిబ్బందికి గాని దాణా సరఫరా చేస్తే వే బిల్లు, డెలివరీ చలానాలు ఉండాలి. అలా లేకుండా నేరుగా రైతులకు ఇచ్చేసినట్టుగా రికార్డుల్లో చూపించేశారు.
- క్యాష్ బుక్‌కు, డైరెక్ట్ క్యాష్ బిల్లుకు తేడా ఉన్నట్టు ఆడిట్ అధికారులు గుర్తించారు. ఉదాహరణకు పోలాకి మండలం దీర్ఘాసి గ్రామానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి వద్ద రూ.3.45లక్షలతో గడ్డి కొనుగోలు చేసినట్టు చూపించారు. కానీ, ఆయనకు రూ.12.49 లక్షలు చెల్లించినట్టు చూపించారు. దాదాపు 9.40 లక్షల తేడాను ఆడిట్ శాఖ గుర్తించింది.
- రూ.70లక్షలతో దాణా కొనుగోలు చేయాల్సి ఉండగా రూ. 95.29 లక్షలకు కొనుగోలు చేసినట్టు చూపించారు. దాదాపు రూ. 25.29 లక్షలు పక్కదారి పట్టించారు.
- దాణా, పశుగ్రాసం కొనుగోలుకు సంబంధించి 2 శాతం టీడీఎస్ కట్టాలి. అదేమీ చేయలేదు. రూ.11.15 లక్షలతో కొనుగోలు చేసినట్టు చూపించారు తప్ప ఏమీ కట్ చేయలేదు.
- తుఫాన్ సమయంలో వాహనాలుతిరిగినట్టుగా చూపించారు. లాగ్ బుక్స్ గాని, వాహనాలు నెంబర్లు గాని, ఓచర్సు లేకుండానే ఖర్చు చేసినట్టు చూపించారు.
- చిల్లర ఖర్చుల కింద రూ. 5.60 లక్షలు చూపించారు. వాటికి కనీస ఆధారాలు చూపించలేదు.
- మందులు కొనుగోలు చేసినట్టు రూ. 29.99 లక్షలు రికార్డుల్లో చూపించారు. వే బిల్లులు, డెలివరీ చలానాలు సమర్పించలేదు.
- రూ. 7.17 లక్షలు పచ్చగడ్డి కొనుగోలు చేసినట్టు చూపించారు. దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలేవు.
- ఏ ఖర్చుకైనా సాధారణంగా యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలి. ఇక్కడదేమీ జరగలేదు.
- రూ.6 కోట్ల 21 లక్షల 25వేల 250 మేర హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి డ్రా చేసి, రూ.5,63,29,029 ఖర్చు చేసినట్టు చూపించారు. మిగిలిన సొమ్మును హెడ్ ఆఫ్ అకౌంట్‌కు జమ చేయాలి. అదేమీ చేయకుండా రూ.57,96,221లను అలాగే ఉంచేశారు. వాటిపై వచ్చిన వడ్డీ సొమ్మును కూడా హెడ్ ఆఫ్ అకౌంట్‌కు జమ చేయలేదు. ఇదంతా ఎక్కడికెళ్లిందో పాత్రధారులకే ఎరుక.

అడ్డగోలు లావాదేవీలివి..



లోకాయుక్త ఆర్డర్ కాపీ

చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులకు ప్రస్తుత డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు

• పెద్దపులి తిరుగుతోంది జాగ్రత్త



సోంపేట పరిసర గ్రామాల్లో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డులు

ఉద్దానంలో పులి సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోంపేట తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ సూచించారు. సోంపేట పరిసర గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలు దాటాక, ఉదయం 6 గంటల్లోపు ఒంటరిగా బయటకు రావద్దన్నారు. పశువులను ఇంటి పరిసర ప్రాంతాల్లో సంరక్షించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పులి సంచారంపై ఎటువంటి సమాచారం ఉన్నా 94924 19724, 85010 08880 నంబర్లకు సమాచారం అందజేయాలన్నారు.

• కంచిలి మండలంలోని మండపల్లి, కుత్తుం పంచాయతీ గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్.హైమావతి సూచించారు. అటవీ, పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. సమాచారం తెలిస్తే కంట్రోల్ రూమ్ నంబర్ 95022 20209కు, అటవీశాఖ నంబర్ 9949170208కు తెలియజేయాలని సూచించారు. – సోంపేట/కంచిలి

కళలకు ఊపిరి

- సుమారు పాతికేళ్లుగా కళలను ఆదరిస్తున్న శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య
- నాటిక ప్రదర్శనలు, కళాకారులకు సత్కారాలు
- ఈ నెల 3 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయి నాటిక పోటీలు



జానపద ప్రదర్శన (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: కనుమరుగవుతున్న కళలకు ఊపిరిపోస్తూ శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య దిగ్విజయంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా నాటికలను బతికించుకోవాలనే తపనతో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రతి నెలా ఒక ప్రదర్శన ఏర్పాటు చేస్తు నాటక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతోంది. ప్రతినెలా కళాప్రదర్శనలు ఇస్తూ, మరోవైపు పేద, వృద్ధ కళాకారులకు పింఛను రూపంలో ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ మరొకటి లేదు.

నెలవారీ సాంస్కృతిక విభాగం ఏర్పడిందిలా..

1978లో కళాకారుల సంక్షేమం కోసం రంగస్థల కళాకారుల సమాఖ్య ఏర్పడింది. గతంలో ఎవరికివారు నాటక సమాజాలను ఏర్పాటు చేసుకొని ప్రదర్శనలు ఇస్తుండేవారు. అయితే ప్రభుత్వం నుంచి కళాకారులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు రావాలంటే జిల్లా వ్యాప్తంగా సమాఖ్య ఉండాలనే ఉద్దేశంతో సమాఖ్య ఏర్పాటు చేశారు. అప్పట్లో ఎక్కువగా ప్రదర్శనలు ఇస్తున్న రవికళామందిర్, శ్రీశైనా ఆర్ట్స్, సోషల్ యూత్ కల్చరల్ ఆర్ట్స్‌తో పాటుగా మరికొన్ని నాటక సమాజాలు కలిశాయి. బాపూజీ కళామందిర్ పునరుద్ధరణలో తమ వంతు కృషి చేసినందుకు శ్రీకాకుళం మున్సిపాలిటీ ప్రతినెలా మొదటి శనివారం కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునేందుకు స్వచ్ఛందంగా అంగీకరించింది. 1999 ఆగస్టు 15న నెలవారీ సాంస్కృతిక విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శ్రీకాకుళరంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమాలను నిర్వహించేందుకు నాందిగా బాపూజీ కళామందిర్ పునర్నిర్మాణంగా చెప్పవచ్చు. శిథిలావస్థలో ఉన్న కళామందిర్ పునర్నిర్మాణానికి సమాఖ్య సభ్యులు చందాలు వేసుకొని రూ.25వేల పెట్టుబడి పెట్టగా.. కళాభిమానులు, పట్టణ ప్రముఖులు, ఎంపీ నిధులు కలసి సుమారు రూ.16లక్షలతో పనులు పూర్తి చేశారు. నాటి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న దూడ భవానీ శంకర్ కౌన్సిల్ తీర్మానంతో సమాఖ్యకు ప్రతి నెలా మొదటి శనివారం ఉచితంగా ప్రదర్శనలకు ఇచ్చేందుకు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. నాటి నుంచి కళాకారులు ప్రతినెలా ఒక సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీకి మొదటి అధ్యక్షుడిగా భవానీ శంకర్, కన్వీనర్‌గా చిట్టి వెంకటరావు వ్యవహరించారు. మొదటి ప్రదర్శన 1999 నవంబరులో జరిగింది. 24 ఏళ్లుగా 288 నెలలు కళాప్రదర్శనలు నిర్వహించారు. తాజాగా 289వ నెల కార్యక్రమాలకు సిద్ధమైంది.

ఎన్నో కళారూపాలు..

పౌరాణిక, సాంఘిక నాటకాలు ప్రదర్శనలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, జానపద కళారూపాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రేతర ప్రాంతాల నుం కళాకారులను రప్పించి ప్రేక్షకులకు అభిరుచికి తగ్గట్లు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కళాకారులు అప్పారావునాయుడు, కుప్పిలి భాస్కరరావుల జ్ఞాపకార్థం నాటక పరిషత్తును మొదటిసారిగా ఎగ్జిబిషన్ కళా ప్రాంగణంలో నిర్వహించారు.

నాటక పోటీల నిర్వహణ..

జిల్లా కళాభిమానుల కోసం రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో 2008లో బంగారు నంది బహుమతి పొందిన నాటకాలను మూడురోజుల పాటు ప్రదర్శించారు. తెలుగు నాటక రంగ దినోత్సవం, ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా 'ముంగిట సన్మానం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 'అజోవిభో కందాళం ఫౌండేషన్', కళాకారుల సమాఖ్య సంయుక్తంగా రాష్ట్ర స్థాయి నాటక పోటీలను దిగ్విజయంగా నిర్వహించింది. పోటీల నిర్వహణలో ఎన్నో విషయాలను నేర్చుకొని నాటినుంచి సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పరిషత్ నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. కొత్త రచన, మొదటి ప్రదర్శన లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తూ రచయితలను, నాటకాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి మేలో సీనియర్ పౌరాణిక కళాకారులు బి.ఏ.మోహనరావు సహకారంతో పౌరాణిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.

కళాకారులకు పింఛను..

నాటరంగానికి, కళారంగానికి సేవలందించిన పేద, వృద్ధ కళాకారులకు పింఛను రూపంలో సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ కాకుండా సమాఖ్య సభ్యులు మాత్రం ప్రతినెలా మొదటి శనివారం 30 మందికి రూ.400 చొప్పున అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యిమంది కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. వీరిచ్చిన గుర్తింపు కార్డులతో ప్రభుత్వ పింఛను పొందుతున్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు..

289వ నెల సందర్భంగా రాష్ట్రస్థాయి నాటిక పోటీలను నవంబరు 3 నుంచి 5 వరకు నిర్వహిస్తున్నారు. 3న విశాఖ, జాస్మిన్ ఆర్ట్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ 'మేము మనుషులమే', చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్స్ డ్రమటిక్ అసోషియేషన్ 'ఏడనున్నాడో–ఎక్కడున్నాడో', 4న విశాఖ పార్వతీనగర్‌కు చెందిన కళాభినయ 'కన్నెర్ర', చిలకలూరిపేటకు చెందిన సుకృతి క్రియేషన్స్ 'మిణుగురు వెలుగులు', 5న నెల్లూరు, క్రాంతి ఆర్ట్ థియేటర్స్ 'ఓమనిషి కావాలి', ఎన్టీఆర్ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సౌజన్యంతో కట్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ 'విముక్తి' నాటికలు ప్రదర్శించనున్నారు.. అదే రోజున విజేతలకు బహుమతులు అందజేస్తారు.

కొత్త నాటికలు రావాలి..



ప్రతి ఏడాది పరిషత్ నాటికల సందర్భంగా కొత్త నాటికలు రావాలనే ఉద్దేశంతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రదర్శనకు ఎంపికైన కొత్తనాటిక రచయితలకు ప్రోత్సాహకంగా నగదు పారితోషికం అందిస్తున్నాం. మాకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. – చిట్టి వెంకటరావు, అధ్యక్షుడు, నెలవారీ సాంస్కృతిక విభాగం

4న శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణా సంస్థ ప్రాంగణంలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాకు ఎస్‌బీఐ కార్డ్స్, ఎం/ఎస్ సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్డ్స్‌లో 30 బ్రాంచ్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్‌కు (జీతం రూ.16 వేల నుంచి రూ.25 వేలు వరకు) ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 30 బ్రాంచ్ రిలేషన్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 20 ఖాళీలున్న టెలీ కాలర్స్, బకెండ్స్ పోర్ట్ టీం (జీతం రూ.16వేలు నుంచి రూ.25 వేలు వరకు) ఇంటర్మీడియట్/డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎం/ఎస్ సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 10 ఖాళీలున్న సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు (జీతం రూ.14500 నుంచి రూ.16500 వరకు) ఇంటర్మీడియట్/డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 ఏళ్ల పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 30 డెలివరీ బాయ్స్ పోస్టులకు (జీతం రూ.10000 నుంచి రూ.12000) 10వ తరగతి/ఇంటర్మీడియట్ విద్యార్హత కల్గి ఉండాలన్నారు. 5 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు (జీతం రూ.12000) ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుండి 35 ఏళ్ల పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 10 మర్చండైజర్ పోస్టులకు (జీతం రూ.10000) పదో తరగతి/ఇంటర్మీడియట్ విద్యార్హత కల్గి ఉండి 18 నుంచి 35 ఏళ్ల పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ నెల 4న ఉదయం 10.30 గంటలకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డ్‌తో హాజరుకావాలని సూచించారు.

స్టాంపు రుసుం రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సంక్షేమ నిధి స్టాంపు రుసుం పెంపు తక్షణం ఉపసంహరించాలని జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల పెంచిన రూ.20 స్టాంపు రుసుం రద్దు చేయాలని కోరారు. న్యాయవాదులకు చెల్లించే ఆరోగ్య ఖర్చులకు పరిహారం, మరణానంతరం న్యాయవాదుల కుటుంబ సభ్యులకు చెల్లించే బీమా మొత్తం పెంచకుండా రాష్ట్ర బార్ కౌన్సిల్ రూ.20 సంక్షేమ నిధి స్టాంపు రుసుం వసూలు చేయడం తగదన్నారు. విధుల బహిష్కరణ గురు, శుక్రవారాల్లోనూ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి, పొన్నాడ రాము, న్యాయవాదులు పి.మల్లిబాబు, డి.ఈశ్వరరావు, బి.సుదర్శన్, ఎస్.వేణుగోపాలరావు, ఐ.సీతరాజు, ఎస్.శంకర్‌రావు, తంగి వాసు, అంబటి ప్రకాష్‌రావు, సూర అప్పలనాయుడు, ఆనందరావు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎనిమిది మందికి సేవా పతకాలు



జగన్నాథం తిప్పేస్వామి, అడిషనల్ ఎస్పీ



పాచిపెంట ఢిల్లీరావు, ఏఎస్‌ఐ, ట్రాఫిక్ పీఎస్



గంగారావు, పీసీ, వన్‌టౌన్



ఎ.సురేష్, డ్రైవింగ్ ఆపరేటర్ (ఫైర్)



టి.రాంబాబు, లీడింగ్ ఫైర్‌మేన్

శ్రీకాకుళం క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖకు ఎనిమిది మందికి సేవా పతకాలు వరించాయి. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదలైంది. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జగన్నాథం తిప్పేస్వామి, ట్రాఫిక్ పీఎస్ ఏఎస్‌ఐ పాచిపెంట ఢిల్లీరావు, ఏఆర్ హెచ్‌సీ సారిపల్లి అప్పలరాజు, శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పీసీ ఇచ్ఛాపురం గంగారావు, రణస్థలం ఫైర్‌స్టేషన్ డ్రైవింగ్ ఆపరేటర్ ఎ.సురేష్, కోటబొమ్మాళి లీడింగ్ ఫైర్‌మెన్ టి.రాంబాబు, విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం ఆర్‌వీ అండ్ ఈవో ఎస్.ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళానికి చెందిన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసరావులకు పతకాలు దక్కాయి. వీరిని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రత్యేకంగా అభినందించారు.



ఎస్.ఉమామహేశ్వరావు, విజిలెన్సు ఆర్‌వీ అండ్ ఈవో